తెలుగు పీఠాధిపతులకూ అవకాశమివ్వండి

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును కోరిన ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): తిరుమల కొండపై ఉన్న హథీరాం మఠంలో తెలుగు పీఠాధిపతులకూ అవకాశం కల్పించాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కోరారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తన నివాసంలో పలువురు బంజారా పీఠాధిపతులు శనివారం కవితతో సమావేశమయ్యారు. తిరుమలలోని హథీరాం మఠంలో తెలుగు పీఠాధిపతులకు కాకుండా ఇతర రాష్ట్రాల పీఠాధిపతులకే అవకాశం కల్పిస్తున్నారన్న అంశాన్ని వారు ఆమె దృష్టికి తెచ్చారు. ఈ విషయంపై టీటీడీ చైర్మన్, పాలకవర్గంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఈ మేరకు స్పందించిన కవిత.. వెంటనే టీటీడీ బోర్డు చైర్మన్ నాయుడుతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అందుకు స్పందించిన ఆయన ఈ అంశాన్ని పాలకమండలి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కవితకు హామీ ఇచ్చారు.

'తక్కువ ధరకే వెదురు సరఫరా చేయండి'

తెలంగాణలోని వెదురు వృత్తిదారులకు తక్కువ ధరకే వెదురు బొంగులను సరఫరా చేయాలని ఎమ్మెల్సీ కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు అటవీ శాఖ మంత్రి కొండా సురేఖకు శనివారం ఆమె లేఖ రాశారు. ఏపీలో తక్కువ ధరలకు వెదురు బొంగులు సరఫరా చేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణలోనూ తక్కువ ధరకే వెదురు బొంగులు సరఫరా చేయాలని కోరారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా 1.50 లక్షల మంది వెదురు, దాని ఆధారిత వృత్తులపై ఆధారపడి జీవన కొనసాగిస్తున్న కుటుంబాలు ప్రమాదంలో పడుతాయని ఆందోళన వ్యక్తంచేశారు.

తెలంగాణపై టీడీపీ ఫోకస్

ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడి

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): తెలుగుదేశం పార్టీ హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో పుట్టిందని.. తెలంగాణపై కచ్చితంగా తమ ఫోకస్ ఉంటుందని ఏపీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు చెప్పారు. ఓ చానల్‌కు శనివారం ఇచ్చిన ఇంటర్వ్యూలో.. టీడీపీని తెలంగాణలో విస్తరించే ఆలోచన ఉందా? అని ప్రశ్నించగా.. 'తెలుగు జాతి అభివృద్ధి ధ్యేయంగా టీడీపీని స్థాపించాం. అదే సమయంలో ఇతర రాష్ట్రాలకు విస్తరించాలనే ఆలోచన మొన్నటివరకు లేదు. రెండు తెలుగు రాష్ట్రాలు విడిపోయిన తర్వాత కొన్ని ఇబ్బందులు వచ్చినా.. పార్టీని ముందుకు తీసుకెళ్తున్నాం. భవిష్యత్తులో పరిస్థితులను బట్టి కార్యాచరణ రూపొందిస్తాం. తెలుగు జాతి ఎక్కడున్నా వాళ్ల అభివృద్ధి కోసం టీడీపీ పని చేస్తుంది' అని అన్నారు. మీరు జైలులో ఉన్నప్పుడు కానీ.. మీపై వ్యక్తిగత విమర్శలు వచ్చినప్పుడు గానీ.. ఖమ్మం, హైదరాబాద్‌లో నిరసనలు జరిగాయి కదా..? అని గుర్తుచేయగా.. 'తెలంగాణలో కార్యకర్తలు ఉన్నారు.. వారిని, ఎన్‌ఆర్‌ఐలను లాజికల్‌గా ముందుకు తీసుకెళ్లాలి. 2047 నాటికి తెలుగు జాతి ప్రపంచంలోనే నం.1గా ఉండాలనేది నా కోరిక' అని తెలిపారు.

కాలేజీల్లో స్కావెంజర్లను నియమించండి

ఇంటర్ విద్యా పరిరక్షణ సమితి డిమాండ్

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో స్కావెంజర్లను నియమించాలని తెలంగాణ ఇంటర్ విద్యా పరిరక్షణ సమితి అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణగౌడ్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. 430 కాలేజీల్లో టాయిలెట్ల శుభ్రతకు అత్యవసరంగా స్కావెంజర్లను నియమించాలని విజ్ఞప్తిచేశారు. భవనాల మరమ్మతులు, రంగులేయడం, ఎలక్ట్రికల్ పనులు, డిజిటల్ బోర్డుల ఏర్పాటుకు నిధులు మంజూరుచేయాలని కోరారు.

కేసీఆర్ నిషాన్‌ను చెరిపేయలేరు!

- కేసీఆర్ పేరెత్తందే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నిద్రపట్టదు
- అభివృద్ధి చేస్తే అక్రమ కేసులా?
- లైడిటెక్టర్ పరీక్షకు సిద్ధమేనా?
- ఏడాదిన్నరగా అటకెక్కిన అభివృద్ధి
- కాంగ్రెస్ పాలనకు కాలం చెల్లింది
- మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి

హైదరాబాద్ మణికొండ మున్సిపాలిటీలో నిర్వహించిన 'గుడ్ మార్నింగ్ మణికొండ - ప్రజాభిప్రాయ సేకరణ'లో పాల్గొన్న మాజీ మంత్రి సబిత, కార్తీక్ రెడ్డి

మణికొండ, జూన్ 14: 'కేసీఆర్ అంటేనే చరిత్ర.. ఆయన తెలంగాణ ఊపిరి.. అలాంటి కేసీఆర్ నిషాన్‌ను ఎవరూ చెరిపేయలేరు.. అది ఎవరి తరమూ కాదు' అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి స్పష్టంచేశారు. హైదరాబాద్ మణికొండ మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన 'గుడ్ మార్నింగ్ మణికొండ -ప్రజాభిప్రాయ సేకరణ' కార్యక్రమ శత దినోత్సవ వేడుకలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అభివృద్ధి ఏదని ప్రశ్నిస్తే.. సీఎం రేవంత్ అక్రమ కేసులను పెట్టి వేధించాలని చూస్తున్నారని విమర్శించారు. నిజంగా అభివృద్ధి చేస్తే అక్రమ కేసులెందుకని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డికి కేసీఆర్ పేరెత్తందే పూట గడపడం లేదని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ప్రత్యక్షంగా మాట్లాడేందుకు రేవంత్ సిద్ధమా? లేదంటే లైవ్ డిటెక్టర్ పరీక్షకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. రాష్ట్రంలో కేసీఆర్‌ను దూషించేందుకు బీజేపీ-కాంగ్రెస్ జట్టుకట్టి బడేభాయ్-ఛోటేభాయ్ పాలన సాగిస్తున్నాయని మండిపడ్డారు. రేవంత్ సర్కారు ప్రజావ్యతిరేక పాలనపై బీజేపీ ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎగిరేది గులాబీ జెండాయేనని ధీమా వ్యక్తంచేశారు. ఇందిరమ్మ ఇండ్లను బీఆర్‌ఎస్ కార్యకర్తలకు ఇస్తామన్న ఓ మంత్రి వ్యాఖ్యలపై ఆమె మండిపడ్డారు. ఇందిరమ్మ ఇండ్లను గాంధీభవన్ నుంచి ఏమైనా ఇస్తున్నారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ సర్కారు పథకాలను అందజేయడం సర్కారు బాధ్యత.. మంత్రి వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమని ధ్వజమెత్తారు.

కేసీఆర్ పేరు దిగజార్చేందుకు కుట్రలు

కేసీఆర్ పేరును దిగజార్చేందుకు రేవంత్‌రెడ్డి సర్కారు కుట్రలు చేస్తున్నదని సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. ఆనాడు సీఎంగా కేసీఆర్ ఓ విజన్‌తో రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మిస్తే.. దానిపై కుట్ర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ తీరుపై యావత్తు తెలంగాణ ప్రజలు తీవ్రస్థాయిలో ఆగ్రహంగా ఉన్నారని, కాంగ్రెస్ పాలనకు కాలం చెల్లిందని చెప్పారు. చదువురాని అమ్మలు కూడా సీఎం రేవంత్‌రెడ్డిని ఈరోజు ప్రశ్నించే పరిస్థితి వచ్చిందని, ఏడాదిన్నర కాలంగా ఈ సర్కారు ఏమీ చేయలేదని తిట్ల వర్షం కురిపిస్తున్నారని చెప్పారు.

ప్రశ్నిస్తున్నవారిపై కక్ష సాధింపా?

మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

హైదరాబాద్ జూన్ 14 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాప్రయోజనాలను పక్కనబెట్టి ప్రశ్నిస్తున్న వారిపై కక్ష సాధింపునకు దిగుతున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఏపీ బనకచర్ల ప్రాజెక్టును నిర్మించి గోదావరిని చెరబడుతుంటే పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం, ఫార్ములా ఈ- రేస్ కేసు పేరిట మాజీ మంత్రి కేటీఆర్‌ను నోటీసులతో వేధిస్తున్నదని శనివారం ఎక్స్‌వేదికగా నిప్పులు చెరిగారు. ఫార్ములా ఈ -కార్ రేస్‌ను తెచ్చి రాష్ట్ర ప్రతిష్టను అంతర్జాతీయస్థాయిలో ఇనుమడింపజేసిన కేటీఆర్‌ను బద్నాం చేసేందుకు కుయుక్తులు పన్నుతున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యమని విమర్శించారు. హస్తం పార్టీ ఎన్ని కుట్రలు చేసినా ప్రజల తరపున పోరాటాన్ని ఆపబోమని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టంచేశారు.

ఆంధ్రప్రదేశ్ డీపీఆర్‌ను అడ్డుకోండి

- టెండర్లను తక్షణమే నిలిపేయండి
- బనకచర్ల -గోదావరి పీఎఫ్‌ఆర్‌ను తిరస్కరించండి
- కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు మంత్రి ఉత్తమ్ లేఖ
- హరీశ్ ప్రెస్‌మీట్ అనంతరం హడావుడిగా విడుదల

హైదరాబాద్, జూన్14 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రీఫీజుబిలిటీ రిపోర్ట్ (పీఎఫ్‌ఆర్)ను తక్షణమే తిరస్కరించాలని కోరుతూ కేంద్ర జల్‌శక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం లేఖ రాశారు. జీబీ లింక్ ప్రాజెక్టు డీపీఆర్‌ను అడ్డుకోవడంతోపాటు, ఏపీ చేపట్టనున్న టెండర్ల ప్రక్రియను కూడా అడ్డుకోవాలని కోరారు. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణకు దక్కాల్సిన గోదావరి నదీ జలాల వాటా హక్కును ఇది ప్రత్యక్షంగా ధిక్కరించడమే అవుతుందని పేర్కొన్నారు. జూన్ 2న నిర్వహించిన సమావేశంలో ఏపీ ప్రభుత్వానికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి సజ్జన్‌యాదవ్ చేసిన సూచనలను బట్టి అప్పటికే పీఎఫ్‌ఆర్‌ను ఆమోదించినట్టు భావించాల్సి వస్తున్నదని తెలిపారు. డీపీఆర్ సమర్పించడమంటే కేంద్ర జల వనరుల సంఘం ఆమోదించినట్టు అవుతుందా? అని ఉత్తమ్ ప్రశ్నించారు. నిధుల కోసం కేంద్రాన్ని ఏపీ ఒత్తిడి చేసిన విషయాన్ని లేఖలో ప్రస్తావించారు. కేంద్ర జలవనరుల సంఘంతోపాటు గోదావరి-కృష్ణా రివర్ బోర్డులు, అపెక్స్ కౌన్సిల్ ఆమోదం లేకుండానే ఈ ప్రాజెక్టు ప్రక్రియ ముందుకు సాగుతున్నదని మండిపడ్డారు. జీడబ్ల్యూడీటీ అవార్డు ప్రకారం 1,486 టీఎంసీల్లో 968 టీఎంసీలు తెలంగాణకు కేటాయించారని, ఆ నీటి వాటాకు కేంద్ర జల వనరుల సంఘం, జీఆర్‌ఎంబీ ఆమోదం కోసం వేచి చూస్తున్న తరుణంలో ఏపీ ప్రభుత్వం కొత్త ప్రాజెక్టులను ఎలా ప్రతిపాదిస్తుందని ప్రశ్నించారు. నీటి కేటాయింపులు లేకుండా ప్రాజెక్టులు నిర్మించే నైతికత ఏపీకి ఎక్కడిదని నిలదీశారు. వాస్తవానికి ట్రిబ్యునల్‌లో వరద నీరనే ప్రస్తావనే లేదని తేల్చి చెప్పారు. కేంద్రం తీసుకునే నిర్ణయాలు తెలంగాణ ప్రాంతాన్ని గందరగోళంలోకి నెట్టి వేస్తున్నాయని, నిబంధనల ప్రకారం బనకచర్ల ప్రాజెక్ట్ అంశంపై జోక్యం చేసుకుని టెండర్ల ప్రక్రియను నిలువరించాలని మంత్రి డిమాండ్ చేశారు. లేదంటే న్యాయపోరాటానికి సిద్ధమవుతామని మంత్రి హెచ్చరించారు.

హరీశ్‌రావు నిలదీతతోనే ఉత్తమ్ లేఖ

జీబీ లింక్ ప్రాజెక్టుపై మాజీమంత్రి హరీశ్‌రావు తెలంగాణ భవన్ వేదికగా మీడియా సమావేశం నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దునుమాడారు. బనకచర్లపై ఎందుకు మాట్లాడటం లేదని నిలదీయడంతోపాటు, రేవంత్ సర్కారు స్పందించకుంటే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించిన విషయం తెలిసిందే. హరీశ్‌రావు ప్రెస్‌మీట్‌తో ప్రభుత్వం ఉలిక్కిపడింది. హరీశ్‌రావు సమావేశం ముగిసిందో లేదో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించారు. కేంద్రజల్ శక్తిశాఖ మంత్రికి రాసిన లేఖను హడావుడిగా మీడియాకు విడుదల చేశారు. దీనిపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చినందుకైనా జల్‌శక్తి శాఖ మంత్రికి లేఖ రాసి విడుదల చేసిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. గతంలో తాను ప్రెస్‌మీట్ పెట్టిన సందర్భంలోనూ బ్యాక్ డేట్ వేసి మీడియాకు లేఖ విడుదల చేసిన సంగతిని గుర్తుచేశారు. లేఖలు రాసి మీడియాకు ఇవ్వడం కాకుండా, చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రిని బనకచర్ల విషయంలో అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌కు డిమాండ్ చేయమనాలని ఎక్స్‌వేదికగా హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

మర్రిగూడెంలో వీర్రాజు మృతదేహం వద్ద రోదిస్తున్న వానరం

మృతదేహం వద్ద వానరం కంటతడి

- కడుపు నింపిన విశ్వాసాన్ని చూపిన మూగ జీవి
- వానరం ప్రేమకు స్థానికులు ఫిదా
- ములుగు జిల్లా మర్రిగూడెంలో ఘటన

వెంకటాపురం(నూగూరు), జూన్ 14: ఎవరైనా చనిపోతే కుటుంబసభ్యులు, బంధువులు మృతదేహం వద్దకు చేరుకొని వారు బతికి ఉన్న రోజులను గుర్తు చేసుకొని రోదిస్తూ ఉంటారు. కానీ, ఓ వ్యక్తి చనిపోతే, అతడితో కలిసి తిరిగిన ఓ వానరం కంటతడి పెట్టుకోవడం అందరినీ కలచివేసింది. వివరాల్లోకి వెళితే.. ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు)బీసీ మర్రిగూడెం గ్రామానికి చెందిన వీర్రాజు స్థానిక దుర్గమ్మ గుడికి ప్రసాదం తీసుకెళ్తూ ఉండేవాడు. అమ్మవారికి మొక్కులు అప్పజెప్పిన అనంతరం గుడి వద్ద ఉన్న ఓ కోతికి ప్రసాదం పెడుతూ దాంతో స్నేహంగా ఉండేవాడు. కాగా అనారోగ్యంతో శనివారం వీర్రాజు మృతి చెందాడు. రోజూ వచ్చే వీర్రాజు గుడికి రాకపోవడంతో వానరం ఆయనను వెతుక్కుంటూ ఇంటికి చేరుకున్నది. మృతిచెందిన వీర్రాజును చూసి తల్లడిపోయి కంటతడిపెట్టి, కడుపు నింపిన విశ్వాసాన్ని చాటింది. ఈ ఘటనను చూసిన గ్రామస్థులు వానర ప్రేమకు ఫిదా అయ్యారు. మూగ జీవి అయినా మనుషుల కంటే నయం అంటూ పొగడ్తలు కురిపించారు.

ఇజ్రాయిల్ తక్షణమే యుద్ధాన్ని ఆపాలి

- 19న సంఘీభావ ర్యాలీలు
- వామపక్ష పార్టీల తీర్మానం

హైదరాబాద్, జూన్ 14(నమస్తే తెలంగాణ): ఇజ్రాయిల్ దేశం పాలస్తీనా, ఇరాన్‌పై జరిపే యుద్ధాన్ని తక్షణమే ఆపాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. శనివారం సీపీఎం రాష్ట్ర కార్యాలయమైన ఎంబీ భవన్‌లో సీపీఎం, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) తదితర పార్టీలు సమావేశమయ్యాయి. ఈ సమావేశానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అధ్యక్షత వహించారు. 20 నెలలుగా గాజాలో పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ నిరంతర బాంబు, వైమానిక దాడులతో బీభత్సం సృష్టిస్తున్నదని, ఇప్పటికే దాదాపు 50 వేల మంది మరణించారని, మౌలిక వసతులను కొల్లగొట్టిందని వామపక్ష నేతలు విమర్శించారు. పాలస్తీనా ప్రజలకు భారత ప్రభుత్వం అండగా నిలవాలని, ఇజ్రాయిల్‌తో అన్ని సైనిక, భద్రతా సహకారాన్ని వెంటనే నిలిపివేయాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ నెల 19న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో సంఘీభావ నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని ఈ సమావేశం నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాతంత్రవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది. సమావేశంలో పశ్య పద్మ (సీపీఐ), జూలకంటి రంగారెడ్డి (సీపీఎం), వేములపల్లి వెంకట్రామయ్య, గోవర్ధన్ (సీపీఐఎంఎల్), రమేశ్‌రాజా (సీపీఐ లిబరేషన్), మురహరి (ఎవయూసీఐ(సీ) పాల్గొన్నారు.

తెలుగుభాషకు మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలి

ఆర్‌యూపీపీ టీజీ డిమాండ్

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ) : తెలుగుభాషకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు(ఆర్‌యూపీపీ) తెలంగాణ రాష్ట్రం-1927 కోరింది. భాషా పరిరక్షణకు ప్రత్యేకంగా మంత్రిని నియమించాలని ప్రభుత్వానికి సూచించింది. ఆర్‌యూపీపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని శనివారం నాంపల్లిలోని హిందీ ప్రచార సభలో నిర్వహించారు. పదోన్నతులు పొందని భాషాపండితులకు ప్రమోషన్లు కల్పించాలని, ప్రాథమిక పాఠశాలల్లోనూ తెలుగు, హిందీ తదితర భాషాపండితులను నియమించాలని తీర్మానించారు.

భూదాన్ దందా నిజమే!

మొదటిపేజీ తరువాయి...

దాఖలు చేశారు. 2023 మార్చి 13న మహేశ్వరం పోలీసులు నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తే కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయని ఈడీ వివరించింది. దర్యాప్తులో సర్వే నం. 181, 182లోని 103 ఎకరాలు నవాబ్ హాజీఅలీఖాన్‌కు చెందినది కాగా, తన కుమారులైన ఫరూక్ అలీఖాన్, అక్బర్ అలీఖాన్‌లకు కానుకగా కొంత ఇవ్వగా 50 ఎకరాలు భూదాన్ బోర్డుకు ఇచ్చారని తెలిపింది. అయితే నవాబ్ కుమార్తె ఖాదరున్నీసా, ఆమె కుమారుడు మునావర్ ఖాన్‌తోపాటు మహమ్మద్ అబ్దుల్ రెహమాన్, మహమ్మద్ అబ్దుల్ అఖ్తర్, మహమ్మద్ అబ్దుల్ షుకూర్, ఎం చంద్రయ్య తదితరులు కుట్రకు తెరతీసినట్టు తెలిపింది. నవాబుకు ఇద్దరు కుమారులు ఉన్నట్టు రెవెన్యూ రికార్డుల్లో ఉన్నప్పటికీ తాను ఒక్కరే వారసురాలుగా ఆమె సమర్పించిన అఫిడవిట్‌ను ఎమ్మార్వో పరిగణనలోకి తీసుకొని ధరణిలో నమోదు చేశారన్నారని పేర్కొంది. వీరందరూ కలిసి 2017లో భూదాన్ యజ్ఞ బోర్డు డీనోటిఫై చేసినట్టు నకిలీ, ఫోర్జరీ లేఖను సృష్టించి అధికారులకు సమర్పించారు. వాస్తవంగా ఇది భూదాన్ భూమిగా రికార్డుల్లో ఉన్నప్పటికీ కుట్రలో భాగంగా అధికారులు డీనోటిఫై చేశారు. 1956లో నవాబ్ హాజీఅలీఖాన్ 50 ఎకరాలను భూదాన్ బోర్డుకు ఇచ్చే లేఖను తహసీల్దార్‌కు అప్పగించారు. దీన్ని తహసీల్దార్ ఆమోదించి 1995లో నిషేధిత జాబితాలో చేర్చారు. సర్వే నం.81లో మిగిలిన భూమిని గైరాన్ సర్కారీ భూములుగా ప్రభుత్వం ప్రకటించింది. నవాబ్ హాజీఅలీఖాన్ 57 ఎకరాలను సర్వే నం.181/1, 2, 3, 5, 6, 182లో అక్బర్ అలీఖాన్, ఫరూఖ్ అలీఖాన్‌కు 1967-68లో మౌఖికంగా కానుకగా ఇవ్వగా, భూసంస్కరణల ట్రిబ్యునల్ దీన్ని ఆమోదించింది. ఈ భూమిని నవాబు కుమారులు 2005లో దస్తగిరి షరీఫ్‌కు, ముజాఫర్ హుస్సేన్‌కు విక్రయించారు. 2006లో నవాబ్ మృతి చెందారు. ఆ తర్వాత తొమ్మిది ఏండ్లకు ఒక్కసారిగా సర్వే నం.181, 182లో భూమిని తండ్రి కానుకగా ఇచ్చారంటూ తప్పుడు పార్టిషన్ అగ్రిమెంట్ డాక్యుమెంట్ పొందారు. దీన్ని ఆమోదించిన అధికారులు వారసత్వ, పాస్‌బుక్ జారీచేశారు. మ్యుటేషన్ కూడా కావడంతో ఈ భూమిని ప్రైవేటు వ్యక్తులకు విక్రయించేశారు. నకిలీ పత్రాలను సమర్పించిన ప్రైవేటు వ్యక్తులతో ప్రభుత్వ అధికారులు కుమ్మక్కై డీనోటిఫై చేశారు. వారసత్వం, డీనోటిఫికేషన్, మ్యుటేషన్‌కు అనుమతించడం, విక్రయానికి ఒప్పందాల్లో అధికారుల పాత్రపై వాంగ్మూలాలను ఈడీ రికార్డు చేసింది. ఇతర శాఖల నుంచి సమాచారం వచ్చాక అధికారులను మరోసారి విచారిస్తామని తెలిపింది. కుట్రలో భాగంగా ఫోర్జరీ పత్రాలు సమర్పించిన ఈ భూదాన్ భూభాగోతం విజయవంతంగా అమలుచేయడం వెనుక, తప్పుగా వారసత్వాన్ని అంగీకరించి ఆమోదించడం వెనుక గత తహసీల్దార్, కలెక్టర్ల పాత్ర ఉన్నట్టు పేర్కొంది. ఈ ప్రక్రియలో అధికారులు కీలకపాత్ర పోషించారని, ఇంకా దర్యాప్తు కొనసాగాల్సి ఉన్నదని ఈడీ నివేదించింది.

షుకూర్ కుటుంబం కొనుగోళ్లు అబద్ధం

సర్వే నం.194, 195లోనూ అక్రమాలు జరిగినట్టు ఈడీ గుర్తించింది. సర్వే నం. 181, 182లపై మహేశ్వరం పోలీసులు ఎఫ్‌ఐఆర్ చేయడంతో తాము కూడా కేసు నమోదు చేసినట్టు తెలిపింది. అయితే, 194, 195 సర్వే నంబర్లకు సంబంధించి మహేశ్వరం పోలీసులు ఏ విధమైన ఎఫ్‌ఐఆర్‌నూ నమోదు చేయలేదని తెలిపింది. దీంతో తాము కూడా ఈ వ్యవహారంపై కేసు నమోదు చేయలేదని వివరించింది. పిటిషనర్ మల్లేశ్ వాంగ్మూలాన్ని నమోదు చేసినట్టు వెల్లడించింది. పిటిషనర్ ఇచ్చిన ఫిర్యాదు కాపీని గత నవంబర్‌లో డీజీపీకి పంపినట్టు వివరించింది. ఇప్పటివరకు పోలీసులు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయలేదని చెప్పింది. సర్వే నం.194లో అబ్దుల్ షుకూర్, కుటుంబసభ్యులు నవాబ్ హాజీ అలీఖాన్ నుంచి కొనుగోలు చేసినట్టు రికార్డులు చూపిస్తున్నాయని తెలిపింది. అయితే నవాబు నుంచి కొనుగోలు చేసిన అబ్దుల్ షుకూర్ బంధువుల్లోని వారికి 11, 6, 2 ఏండ్ల వయస్సు ఉండటంపై సందేహాలు ఉన్నాయని ఈడీ చెప్పింది. ఇప్పటికే తప్పుడు డాక్యుమెంట్లతో కొనుగోలు వ్యవహారాలకు సంబంధించి అబ్దుల్ షుకూర్‌పై రెండు కేసులు నమోదయ్యాయని గుర్తు చేసింది. 1957-58లో నవాబ్ హాజీ అలీఖాన్‌కు సర్వే నం. 181, 182, 194, 195లో 779.7 ఎకరాలుండగా 564.91 ఎకరాలను కౌలుదారులకు విక్రయించారని తెలిపింది. సర్వే నం. 195లో 38.24 ఎకరాలు, మరో 57.22 ఎకరాలు జబర్దస్త్‌ఖాన్‌కు, మహమ్మద్ ఆలమఖాన్‌కు విక్రయించారని ఈడీ వివరించింది. 103 ఎకరాలను కుమారులకు, భూదాన్ బోర్డుకు కానుకగా ఇచ్చారని, 1992కు ముందే నవాబు భూమిని అంతా విక్రయించి, పంపిణీ కూడా చేశారని, కాబట్టి 1992లో అబ్దుల్ షుకూర్ కుటుంబసభ్యులు కొనుగోలు చేశారన్నది నిజం కానట్టు స్పష్టమవుతున్నదని వివరించింది. తప్పుడు మ్యుటేషన్ వల్ల 11 భూ లావాదేవీలు జరిగాయి. దీనివల్ల ప్రభుత్వానికి రూ.17.5 కోట్ల మేరకు నష్టం జరిగింది. భూమి ప్రైవేట్ బిల్డర్ల వశం అయ్యింది. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి భూదాన్ భూములు వెళ్లాయి. కోట్ల రూపాయల విలువైన భూధాన్ బోర్డ్ భూముల అన్యాక్రాంతం వెనుక ఉన్న వారి బాగోతాలను బట్టబయలు చేయడానికి మరింత లోతుగా దర్యాప్తు చేయాల్సి ఉంది.. అని ఈడీ దాఖలు చేసిన కౌంటర్ పిటిషన్‌లో హైకోర్టుకు వివరించింది.

17.5 కోట్ల నష్టంపై ఎఫ్‌ఐఆర్

దస్తగిరి షరీఫ్ ప్రైవేట్ ఫిర్యాదు ఆధారంగా మహేశ్వరం పోలీసులు 2023 మార్చి 13న ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ఖాదరున్నీసా, మహమ్మద్ మునావర్‌ఖాన్, బొబ్బిలి దామోదర్‌రెడ్డి, బొబ్బిలి విశ్వనాథరెడ్డి, ఎన్ సంతోష్‌కుమార్, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మోసపూరితంగా భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారని కేసు నమోదైంది. గత మండల రిజిస్ట్రార్ ఆర్వీ జ్యోతి సహకారంతో విక్రయాలు చేశారని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. నవాబ్ హాజీ అలీఖాన్ నుంచి కానుకగా పొందిన కుమారులు మహమ్మద్ అక్బర్ అలీఖాన్, మహమ్మద్ ఫరూఖ్ అలీఖాన్ నుంచి వీరిద్దరు భూమి కొనుగోలు చేశారు. అయితే 2006లో అప్పటి ఏపీ ప్రభుత్వం సర్వే నం.181లో మొత్తం భూమి భూదాన్ భూములుగా నోటిఫై చేయగా దస్తగిరి హైకోర్టును ఆశ్రయించి స్టే పొందారు. వారసురాలుగా ఖాదరున్నీసా, ఆమె కుమారుడు మునావర్ ఖాన్ 10.12 ఎకరాలు విక్రయించగా దస్తగిరి సివిల్ సూట్ దాఖలు చేసి ఇంజంక్షన్ ఉత్తర్వులు పొందారు. ఖాదరున్నీసా, మునావర్ మోసపూరితంగా మ్యుటేషన్ చేయించుకుని 11 విక్రయ ఒప్పందాలు చేశారు. ప్రభుత్వ భూమిగా నోటిఫై అయిన 40 ఎకరాలను విశ్వనాథ్‌రెడ్డి, ఎన్ సంతోష్‌కుమార్‌కు రూ.13.57 కోట్లుకు విక్రయించారు. వీరిద్దరు ఈ భూమిని రూ.17.50 కోట్లకు ఈపీఐఎల్‌కు విక్రయించారు. కుట్రలో భాగంగా నకిలీ, ఫోర్జరీ డాక్యుమెంట్లతో ప్రభుత్వ భూమి ప్రైవేటు బిల్డర్ పరమైంది. వీరి కుట్రతో రూ.17.50 కోట్ల మేర ప్రభుత్వానికి నష్టం జరిగినట్టు ఎఫ్‌ఐఆర్ నమోదైంది.

లోక్ అదాలత్ పాత విధానమే

హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): లోక్ అదాలత్ అనేది కొత్త విధానమేమీ కాదని గతంలో అమలైన విధానమేనని, ఇందులో రాజీ ద్వారా వివాదాలు పరిష్కారం అవుతాయని హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజయ్‌పాల్ చెప్పారు. కోర్టుల్లో అయితే ఒక పక్షమే గెలుస్తుందని, ఓడిన పక్షం పైకోర్టుకు అప్పీలుకు వెళ్తుందని తెలిపారు. ఈ విధానానికి భిన్నంగా ప్రారంభమైనదే లోక్ అదాలత్ అని, ఇందులో కేసులను రాజీ చేసుకోవడం ద్వారా ఇరుపక్షాలు విజేతలుగా నిలుస్తాయని వివరించారు. రాష్ట్రవ్యాప్త లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం ఆయన హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సిటీ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎస్ శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 12.48 లక్షల కేసుల పరిష్కారం

శనివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల్లో జరిగిన లోక్ అదాలత్‌లో 12.48 లక్షల కేసులు పరిష్కారమైనట్టు రాష్ట్ర న్యాయసేవాధికార సభ్యకార్యదర్శి సీహెచ్ పంచాక్షరి వెల్లడించారు. వాటిలో 7.85 లక్షల పెండింగ్ కేసులతోపాటు 4.63 లక్షల ప్రీలిటిగేషన్ కేసులు ఉన్నాయని, ఈ కేసుల రాజీతో కక్షిదారులకు రూ.935 కోట్ల పరిష్కారం లభించనున్నదని తెలిపారు.

హైకోర్టులో 120 కేసుల పరిష్కారం

లోక్ అదాలత్‌లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ, మాజీ న్యాయమూర్తి జస్టిస్ జీ శ్రీదేవి ధర్మాసనం 120 కేసులను పరిష్కరించింది. ఇందులో 84 వాహన ప్రమాద కేసులు ఉన్నాయని, ఆ కక్షిదారులకు రూ.9 కోట్లను పరిహారంగా ప్రకటించారని హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ కార్యదర్శి ఎం శాంతివర్ధని తెలిపారు.

మల్లారెడ్డి మెడికల్ కాలేజీలో స్టైపెండ్ చెల్లింపు

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో స్టైపెండ్ చెల్లించాలని రాష్ట్రవ్యాప్తంగా వైద్య విద్యార్థులు సోమవారం నుంచి విధులు బహిష్కరించి ఆందోళన చేస్తున్నారు. తాజాగా శనివారం విద్యార్థులకు నెలకు రూ.19,000 చెల్లించేందుకు మల్లారెడ్డి మహిళా మెడికల్ కళాశాల యాజమాన్యం ముందుకొచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ నెలకు ఈ మొత్తాన్ని చెల్లిస్తామని కళాశాల యాజమాన్యం తెలిపినట్టు మెడికోలు వెల్లడించారు. విద్యార్థుల బయోమెట్రిక్ హాజరు ఆధారంగా స్టైపెండ్ చెల్లిస్తుందని చెప్పినట్టు విద్యార్థులు పేర్కొన్నారు.

ఉద్యోగం రావడంలేదని.. బీటెక్ యువకుడి ఆత్మహత్య

పెద్దపల్లి జిల్లా కన్నాలలో ఘటన

నవీన్ (ఫైల్)

పాలకుర్తి, జూన్14: బీటెక్ చేసి ఏండ్లు గడుస్తున్నా ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం కన్నాలలోని శాలపల్లిలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాలకు చెందిన బండి నవీన్ (27) 2018లో బీటెక్ పాస్‌అవుట్ అయ్యాడు. ఏడేండ్లుగా ఉద్యోగవేటలో ఉన్నాడు. ఎంత ప్రయత్నించినా సరైన కొలువు దక్కకపోవడంతో మనస్తాపం చెందాడు. ఈ నెల 12న ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి కరీంనగర్‌లోని దవాఖానకు తరలించగా, చికిత్సపొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. సోదరుడు కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ స్వామి తెలిపారు.

నవీన్ కండ్లు సజీవం

బండి నవీన్ శుక్రవారం మృతిచెందగా, అతడి కండ్లను కుటుంబసభ్యులు దానం చేశారు. సదాశయ ఫౌండేషన్ పాలకుర్తి మండలాధ్యక్షుడు భీమనపల్లి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఐ బ్యాంకుకు నేత్రదానం చేశారు. అంధులకు కంటిచూపు ప్రసాదించేందుకు పెద్ద మనసుతో నేత్రదానానికి ముందుకు వచ్చిన తల్లి లక్ష్మి, అన్నావదిన కిరణ్, సుప్రితను గ్రామస్థులు అభినందించారు.

లోన్‌యాప్ వేధింపులకు యువకుడి బలి

పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లో ఘటన



సాయి కిశోర్ (ఫైల్)

పెద్దపల్లి రూరల్, జూన్ 14: లోన్ యాప్ వేధింపులకు పెద్దపల్లి జిల్లా పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌కు చెందిన తాడిచెట్టి సాయి కిశోర్ (27) బలయ్యాడు. కుటుంబ సభ్యులు, బసంత్‌నగర్ ఎస్సై కే స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాయికిశోర్ కరీంనగర్‌లో ఏసీ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అవసరాల కోసం ఆన్‌లైన్ లోన్ యాప్‌లో రూ.లక్ష అప్పు చేశాడు. ఇటీవలి కాలంలో లోన్ యాప్ సిబ్బంది వేధింపులు పెరిగిపోవడం, అప్పుతీర్చే మార్గం లేక మనస్తాపం చెందాడు. ఈనెల 6న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు గమనించి చికిత్స కోసం తొలుత పెద్దపల్లి, తర్వాత కరీంనగర్ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని దవాఖానలో చేర్పించగా.. చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. తండ్రి సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు. సాయి కిశోర్ మృతి చెందడంతో అతని కండ్లను హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ దవాఖానకు కుటుంబ సభ్యులు దానం చేశారు.

విద్యుత్తుషాక్‌తో లైన్‌మన్ మృతి

- మ్యారేజ్ డే మరుసటి రోజే క్రాంతికుమార్ మృత్యువాత
- మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో విషాదం



క్రాంతికుమార్ (ఫైల్)

డోర్నకల్, జూన్ 14 : పెండ్లిరోజు జరుపుకొన్న మరుసటి రోజే కరెంట్ షాక్‌తో విద్యుత్తు ఉద్యోగి మృతిచెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. డోర్నకల్ సబ్‌స్టేషన్‌లో అసిస్టెంట్ లైన్‌మన్‌గా పనిచేస్తున్న క్రాంతికుమార్(32) మున్నేరువాగు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తుండగా, కరెంటు తీగ తగిలి విద్యుత్తు షాక్‌కు గురయ్యాడు. స్థానిక రైతు గమనించి ఏఈ కిరణ్‌కు సమాచారం ఇవ్వడంతో పాటు సీపీఆర్ చేసి, పంట పొలాల మీదుగా బైక్‌పై తీసుకొచ్చి 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. ఘటనా స్థలాన్ని ఏఈ కిరణ్, ఎస్సై ఉమ పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. క్రాంతికుమార్‌ది నర్సింహులపేట మండలం. ఈ నెల 13న క్రాంతికుమార్ మ్యారేజ్ డేగా చేసుకొని కుటుంబసభ్యులతో సంతోషంగా గడిపాడు. మ్యారేజ్ డే మరుసటి రోజే మృత్యువాతపడటంతో కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకున్నది.